క్లుప్తంగా

అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన


శంకుస్థాపనలో మంత్రి ధర్మాన ప్రసాదరావు తదితరులు

శ్రీకాకుళం (పీఎస్‌కాలనీ): నగరపాలక సంస్థ పరిధిలోని పలు ప్రాంతాల్లో నిర్మించిన అభివృద్ధి పనులను మంత్రి ధర్మాన ప్రసాదరావు సోమవారం ప్రారంభించారు. పొడుగు నారాయణమ్మ కాలనీ (బొందిలీపురం)లో రూ.6.75 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు, చిన్నబొందిలీపురం, హరిజనవీధిలో రూ.5.90 లక్షల వ్యవయంతో నిర్మించిన సీసీ రోడ్, డ్రైన్లను, జిల్లా పరిషత్‌ను ఆనుకొని ఉన్న హౌసింగ్‌బోర్డు కాలనీ వద్ద రూ.19 లక్షలతో నిర్మించిన సీసీరోడ్డును ప్రారంభించారు. అలాగే రూ.23 లక్షలతో డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. మున్సిపల్ కమిషనర్ చల్లా ఓబులేసు, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ మెంటాడ పద్మావతి, వైఎస్సార్‌సీపీ నాయకుడు సాధు వైకుంఠరావు, టంకాల బాలక్రిష్ణ, నక్క రామరాజు, ఎండ రమేష్, చల్లా శ్రీనివాసరావు ఉన్నారు.

ట్రాఫిక్ సీఐగా అవతారం



శ్రీకాకుళం క్రైమ్: శ్రీకాకుళం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం.అవతారం సోమవారం విధుల్లో చేరారు. ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా విశాఖ సిటీ నుంచి అవతారం ఇక్కడికి వచ్చారు. 2004 బ్యాచ్‌కు చెందిన అవతారం జిల్లాకు సుపరిచితుడే. కోటబొమ్మాళిలో ఎస్సై విధుల్లో చేరిన ఆయన సీతంపేట, పోలాకి, శ్రీకాకుళం రూరల్ (పెద్దపాడు)ల్లో చేసి మెరైన్ సీఐగా 2013లో విశాఖపట్నంలో పదోన్నతి పొందారు. తర్వాత ఇచ్ఛాపురం, విశాఖ సిటీ, విశాఖ క్రైమ్, విశాఖ సీసీ ఆర్బీల్లో సీఐగా చేశారు. ఇతని స్వగ్రామం విజయనగరం జిల్లా వేపాడ మండలం సింగరాయి.

విద్యతోనే పేదరిక నిర్మూలన


ఝాన్సీకి నగదు బహుమతి అందజేస్తున్న వీసీ వెంకటరావు

ఎచ్చెర్ల క్యాంపస్: విద్యతోనే పేదరిక నిర్మూలన సాధ్యమని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు అన్నారు. ఆయన స్వగ్రామం కుప్పిలిలో 10వ తరగతిలో మెరిట్ విద్యార్థి దారపు ఝాన్సీ, 7వ తరగతి మెరిట్ విద్యార్థి అలుపాన జగన్నాథంకు రూ.2వేల చొప్పున సోమవారం ఆర్థిక సహాయం అందజేశారు. ప్రతి ఏటా బహుమతులు అందించేందుకు రూ. 50 వేలను బ్యాంక్‌లో డిపోజిట్ చేశారు. ఎంపీటీసీ బల్లాడ జనార్దనరెడ్డి, హెచ్‌ఎం జె.పద్మావతి, స్థానిక పెద్దలు బల్లాడ గోపాలరెడ్డి, అరుణరెడ్డి, ప్రతిభారెడ్డి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత పట్టణంగా శ్రీకాకుళం


జూట్ బ్యాగులను ఆవిష్కరిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళం మున్సిపాలిటీని ప్లాస్టిక్ రహితంగా తిర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నగరపాలకసంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు అన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ ఆధ్వర్యంలో జూట్ బ్యాగుల పంపిణీకి సంబంధించి సోమవారం ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్లాస్టిక్ నియంత్రణ, తడి, పొడి చెత్త నిర్వహణపై ప్రజలకు అవగాహన కల్పించడంలో లయన్స్ క్లబ్ చేస్తున్న కృషిని కొనియాడారు. నగరపాలక పరిధిలో ప్లాస్టిక్ నియంత్రణకు ఇతర స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని పిలుపు నిచ్చారు. క్లబ్ అధ్యక్షుడు పొన్నాడ రవికుమార్ అధ్యక్షత జరిగిన ఈ కార్యక్రమంలొ క్లబ్ మెంటార్ నటుకుల మోహన్, జోన్ చైర్‌పర్సన్ డాక్టర్ బాడాన దేవభూషణరావు, లయన్ వేణు ఉన్నారు.

తెలుగు అధ్యాపకునికి అభినందన


ముకుందరావును అభినందిస్తున్న డైరెక్టర్ ధనబాలాజీ, ఓఎస్‌డీ సుధాకర్‌బాబు

ఎచ్చెర్ల క్యాంపస్: రాజమహేంద్రవరంలో ఈ నెల 5, 6, 7 తేదీల్లో నిర్వహించి తెలుగు మహాసభలకు శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం తెలుగు అధ్యాపకుడు పెద్దింటి ముకుందరావు హాజరయ్యారు. తెలుగు భాష ప్రాధాన్యతపై ఆయన ఉపాన్యాసం చేశారు. ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ కొక్కిరాల వెంకట ధన బాలాజీ, ఓఎస్‌డీ ప్రొఫెసర్ ఎల్.సుధాకర్ బాబు ఆయనను క్యాంపస్‌లో సోమవారం అభినందించారు.

బాగుబడింది..!

- నాడు–నేడుతో ప్రభుత్వ బడులకు కొత్తజీవం
- 81 పాఠశాలలకు కొత్త హంగులు
- రూ. 23.48 కోట్లు వ్యయంతో పనులు

ప్రగతి పర్వం

పెచ్చులూడే శ్లాబులు, పగిలిన గచ్చులు, వేసవి ఉక్కబోత, నేలమీద, చెట్లు కింద చదువులు, తిరగని ఫ్యాన్లు, వెలగని లైట్లు, కాలకృత్యాలకు అవస్థలు, తాగునీటి కోసం ఇబ్బందులు ఇదీ గత ప్రభుత్వాల్లో ప్రభుత్వ బడుల దుస్థితి. కానీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ వచ్చింది. మనబడి నాడు–నేడు కార్యక్రమంతో పాఠశాలలు కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దారు. ఫలితంగా విద్యార్థులకు విశాలమైన తరగతి గదులు, డెస్కులతో కూడిన పటిష్టమైన బెంచీలు, అత్యాధునిక మరుగు దొడ్లు తదితర సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయి. – గార



నా పేరు ఎం.భవ్యశ్రీ. నేను అంపోలు హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్నాను. మా స్కూలు ఇంత అందంగా మారుతుందని ఎప్పుడూ అనుకోలేదు. నా స్నేహితులు కొందరు ప్రైవేటు స్కూల్లో చదువుతున్నారు. వారు మాతో మాట్లాడేటప్పుడు వాళ్ల స్కూల్స్ చాలా బాగుంటాయని చెప్పేవారు. కానీ ఇప్పుడు వాళ్ల స్కూల్స్ కంటే మా స్కూల్ చాలా బాగుంది. స్కూల్‌లో అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశారు. మంచి బెంచీలు, లైట్లు, ఫ్యాన్లు, మరుగుదొడ్లు అందుబాటులో ఉన్నాయి. అందుకే ఇక్కడ చదువు ఇష్టంగా ఉంది.


అంపోలు జెడ్పీ ఉన్నత పాఠశాల

మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు	98
చదువుతున్న విద్యార్థులు	6,738
తొలి విడత నాడు–నేడు పనులు జరిగిన పాఠశాలలు	28
తొలి విడత వ్యయం	రూ.8.23 కోట్లు
రెండో విడత నాడు–నేడు జరిగిన పాఠశాలలు	53
రెండో విడత వ్యయం	రూ.15.16 కోట్లు


వమరవల్లి గురుకులం

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత గార మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో వినూత్నమైన మార్పులు తీసుకొచ్చారు. రెండు విడతలుగా నాడు–నేడులో పాఠశాలలను అందంగా తీర్చిదిద్దారు. భవనాలకు మరమ్మతులు చేయడంతో పాటు వివిధ రకాల బొమ్మలను వేశారు. నేలపై కూర్చునే పరిస్థితి నుంచి విద్యార్థులకు డెస్కులతో కూడిన బెంచీలను ఏర్పాటు చేశారు. అదనపు తరగతి భవనాలతో పాటు అధునాతన టాయిలెట్లును నిర్మించారు. తొలి విడతలో శతశాతం పనులు పూర్తవ్వగా, రెండో విడతలో చివరి అంకంలో ఉన్నాయి. దీంతో సర్కారీ స్కూళ్ల విద్యార్థులతో పాటు తల్లిదండ్రుల అభిమానాన్ని చూరగొంటున్నాయి.

అప్పటికీ, ఇప్పటికీ చాలా తేడా



నాడు–నేడు నిధులతో మా స్కూల్లో మౌలిక వసతులు కల్పించారు. గతంలో టాయిలెట్‌కు వెళ్లాలంటే చాలా ఇబ్బంది పడేవాళ్లం. గదులు తక్కువగా ఉండి దుర్వాసన వచ్చేవి. ఇప్పుడు మా ఇంట్లో కూడా ఇంత అందమైన మరుగుదొడ్లు లేవు. పేద పిల్లల చదువు కోసం ఇంతగా ఆలోచిస్తున్న జగన్ మామయ్య అంటే ఇష్టం పెరిగింది.

– ఆర్.జానకిలక్ష్మి, పదో తరగతి, అంపోలు జెడ్పీ స్కూల్

రాష్ట్రంలోనే అధిక పింఛన్


శ్రీకాకుళం రూరల్: పింఛన్ అందజేస్తున్న రామ్‌మనోహర్‌నాయుడు

- వైఎస్సార్‌సీపీ నాయకుడు రామ్‌మనోహర్‌నాయుడు

శ్రీకాకుళం రూరల్: అధిక పింఛన్ అందజేస్తున్న ఘనత రాష్ట్రంలోని వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందని వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు అన్నారు. పాత్రునివలస గ్రామంలో పింఛన్ల పంపిణీ ప్రక్రియను సోమవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం పెంచుకుంటూ రూ.మూడు వేలు అందజేస్తున్నారన్నారు. శ్రీకాకుళం నియోజకవర్గంలోని మంత్రి ధర్మాన ప్రసాదరావు చేసిన అభివృద్ధిని చూసి పట్టం కట్టాలన్నారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.


గార: పింఛన్ అందజేస్తున్న రఘురామ్

పేదలకు భరోసా

గార: వృద్ధులు, వితంతువులకు వైఎస్సార్ పింఛన్ కానుక భరోసా అని ఎంపీపీ గొండు రఘురామ్ అన్నారు. బందరువానిపేట, కొర్లాం పంచాయతీల్లో పింఛన్లను పంపిణీ చేశారు. సర్పంచ్ పీస శ్రీహరిరావు, ఎంపీటీసీ సభ్యులు బర్రి లక్ష్మి, గుజ్జల అప్పలరాజు ఉన్నారు.

పెరటికోళ్ల యూనిట్ల పంపిణీ

రణస్థలం: పెరటికోళ్ల పెంపకంతో మహిళలు అదనపు ఆదాయం అర్జించవచ్చని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని వెలుగు కార్యాలయం ఆవరణంలో పెరటికోళ్లను మహిళా సంఘాల సభ్యులకు పంపిణీ చేశారు. మండలానికి 110 యూనిట్లు పెరటికోళ్లు వచ్చాయని, ఒక్కొక్క యూనిట్ విలువ రూ.2800 అన్నారు. వెలుగు సిబ్బంది, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఎచ్చెర్లలో..

ఎచ్చెర్ల: మండలంలోని గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో డ్వాక్రా మహిళలకు పెరటికోళ్ల యూనిట్లను ఎంపీపీ మొదలవలస చిరంజీవి పంపిణీచేశారు. గ్రామీణ ప్రజలు వ్యవసాయంతోపాటు వివిధ మార్గాల ద్వారా ఆర్థిక సమృద్ధిని సాధించాలని సూచించారు.

వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ముద్దాడ శంకర్, అగ్రకల్చర్ అడ్వయిజర్ బోర్డు చైర్మన్ బొడ్డేపల్లి సుధాకర్, నేతింటి సత్యనారాయణ, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

గొర్లె శ్రీరాములు నాయుడు సేవలు చిరస్మరణీయం

- ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్


గొర్లె శ్రీరాములు నాయుడు విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

రణస్థలం: నీతి, నిజాయితీ పాలనకు కేరాఫ్‌గా నిలిచి, సిక్కోలు చరిత్రలో చెరగని ముద్ర వేసిన మహానుభావుడు స్వర్గీయ గొర్లె శ్రీరాములునాయుడని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ కొనియాడారు. శ్రీరాములునాయుడు వర్ధంతి సందర్భంగా మండల కేంద్రంలోని ఆయన విగ్రహానికి సోమవారం నివాళులర్పించారు. మండలంలోని నిరుపేదలకు దుస్తులు, ఆహార పొట్లాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. శ్రీకాకుళం ఖ్యాతిని శ్రీరాములునాయుడు నలుదిశలా చాటిచెప్పి జిల్లాకే వన్నెతెచ్చారన్నారు. రైతుల సంక్షేమం కోసం సాగునీటి ప్రాజెక్టుల నెలకొల్పడంలో ఆయన పాత్ర మరువలేనిదన్నారు. పేద బడుగు బలహీన వర్గాలకు, మత్స్యకారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడం, మారుమూల గ్రామాలకు ఆ రోజుల్లో తారురోడ్లు వేయడం పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబర్చారని గుర్తుచేశారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పలు క్రియాశీలక రాజకీయ పదవులు అలంకరించారన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి పిన్నింటి సాయికుమార్, జెడ్పీటీసీలు టొంపల సీతారాం, మీసాల సీతంనాయుడు, పార్టీ మండల అధ్యక్షులు మహంతి పెదరామినాయుడు, దన్నాన రాజినాయుడు, నాయకులు కురిటి రామకోటి, వైస్ ఎంపీపీ రాయపురెడ్డి భుజంగరావు, మైలపల్లి కామరాజు, గొర్లె అప్పలనర్సునాయుడు, గొర్లె అప్పలనాయుడు, మహంతి చినరామినాయుడు, కిల్లారి రమణ, సనపల నారాయణరావు, బొంతు సూర్యనారాయణ, గురాన మానస, జే.ఆర్.పురం సర్పంచ్ బవిరి రమణ తదితరులు పాల్గొన్నారు.

మచ్చలేని నాయకుడు శ్రీరాములునాయుడు

శ్రీకాకుళం: రాజకీయాల్లో మచ్చలేని నాయకుడు, మాజీ మంత్రి గొర్లె శ్రీరాములునాయుడు అని జిల్లా తూర్పు కాపు సంఘం అధ్యక్షుడు ఎస్.మోహనరావు అన్నారు. శ్రీరాములునాయుడు 16వ వర్ధంతి సందర్భంగా నగరంలోని ఏడురోడ్లు కూడలి వద్ద ఉన్న ఆయన విగ్రహానికి నాయకులు సోమవారం పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మోహనరావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో తూర్పు కాపుల కీర్తి, తన పాలనా దక్షతతో గుర్తింపు తెచ్చుకున్నారన్నారు. డీసీసీబీ మాజీ చైర్మన్ డోల జగన్మోహన్ మాట్లాడుతూ.. విలువలతో కూడిన రాజకీయం చేయడంతో పాటు ఎందరో నేతలను తయారు చేసిన ఘనత శ్రీరాములునాయుడుకు దక్కుతోందన్నారు. రాజకీయాలకు వన్నె తెచ్చిన ఆదర్శమూర్తి అని శ్రీకాకుళం మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ పైడిశెట్టి జయంతి అన్నారు. కార్యక్రమంలో రణస్థలం జెడ్పీటీసీ మాజీ సభ్యుడు జి.లక్ష్మణరావు, లంక గాంధీ, శాసనపు జోగినాయుడు, డోల బాలకృష్ణ, కోల చిన్ని, వాళ్ల శ్రీరాములు, తవిటన్న ఉన్నారు.

'ఆడుదాం–ఆంధ్రా' టీషర్టులు పంపిణీ


టీషర్టులను పంపిణీ చేస్తున్న నాయకులు

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని 50వ డివిజన్ బైరివానిపేట గ్రామంలో సోమవారం 'ఆడుదాం–ఆంధ్రా' క్రీడాకారులకు టీ షర్టులను వైఎస్సార్‌సీపీ నాయకులు కోణార్క్ శ్రీను, సీపాన రామారావు, సీపాన భాస్కరరావు పంచిపెట్టారు. అలాగే పలువురు లబ్ధిదారులకు పింఛన్లను పంపిణీ చేశారు. సచివాలయం అడ్మిన్ పి.విజయ్‌భాస్కర్, సిబ్బంది పాల్గొన్నారు.

తాగిన మైకంలో దాడి

శ్రీకాకుళం క్రైమ్: తాగిన మైకంలో ఉన్న కొంతమంది ముగ్గురు సోదరులపై దాడి చేశారు. ఈ సంఘటన నగరంలోని మండలవీధిలో ఆదివారం రాత్రి చోటుచేసుకుందని ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్సై బలివాడ గణేష్ సోమవారం తెలిపారు. శ్రీకాకుళం రూరల్ మండలం బలివాడ గ్రామానికి చెందిన పైలా నందేష్ మోటారు ఫీల్డులో ఉంటూ తన తల్లిదండ్రులతో కలిసి జీవిస్తున్నాడు. మండల వీధిలో ఉంటున్న తన సోదరుడు ఉమామహేశ్వరరావు తాలుకా ఆటో మరమ్మతు నిమిత్తం ఆదివారం రాత్రి వెళ్లాడు. అదే సమయంలో అటుగా వస్తున్న నందేష్ పాత మిత్రుడు రాజు, అతనితో పాటు మరో నలుగురు వచ్చి ఆటోను నందేష్ మీదకు తోసేశారు. దీంతో ఇదేమని అడిగితే ముఖంపై బలంగా పిడిగుద్దులు కురిపించారు. ఈలోగా ఇంట్లో నుంచి వచ్చిన నందేష్ సోదరులు ఉమామహేశ్వరరావు, సంతోషకుమార్ అడ్డుకునే ప్రయత్నం చేయగా వారిపై కూడా రాళ్లతో దాడి చేశారు. ఉమామహేశ్వరరావు ముక్కుకు, సంతోష్‌కు కంటిపై గాయమైంది. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

ఇంద్ర బస్సును వినియోగించుకోవాలి

శ్రీకాకుళం క్రైమ్: జిల్లా కేంద్రం నుంచి విశాఖపట్నం సిటీకి వెళ్లడానికి ఇంద్ర నాన్‌స్టాప్ ఏసీ బస్సు సర్వీసును ప్రయాణికులు వినియోగించుకోవాలని శ్రీకాకుళం ఒకటో డిపో మేనేజర్ మల్లికార్జునరావు కోరారు. ఈ బస్సులు ప్రస్తుతానికి రెండు ఉన్నాయని.. రోజుకు రెండు ట్రిప్పుల చొప్పున తిరుగుతాయన్నారు. మెట్రో లగ్జరీ ఏసీ బస్సు టికెట్ చార్జీ (రూ. 260) కన్నా రూ. 10లు తక్కువగా ఉండి సెమీ స్లీపర్ సౌకర్యం కలదన్నారు.

నేత్రపర్వంగా దీపోత్సవం


దీపారాధనలో భక్తులు

శ్రీకాకుళం కల్చరల్: ధనుర్మాసం సందర్భంగా పట్టణంలోని బ్యాంకర్స్ కాలనీ, శివబాలాజీ ఆలయంలో ఉన్న కల్యాణ వేంకటేశ్వరస్వామి చెంతన దీపారాధనలు సోమవారం జరిగాయి. అర్చకులు గోపినంబాళ్ల వెంకట సీతారామాచార్యులు, సత్యకూర్మాచార్యుల ఆధ్వర్యంలో టీటీడీ దేవస్థానం వారిని అనుసరించి మంగళాశాసన పాశురం చదువుతూ పద్మాకారంలో 1001 దీపాలను వెలిగించి వేడుకలు జరిపారు. ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు గుంట తులసీరావు, సామంత్ పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్ల పట్టాలు


పట్టాలను అందజేస్తున్న మంత్రి ధర్మాన

- మంత్రి ధర్మాన ప్రసాదరావు

గార: అర్హులందరికీ ఇళ్ల పట్టాలు అందజేశామని రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. రామచంద్రాపురం పంచాయతీలో 67 మందికి ఇళ్ల పట్టాలను సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదలందరికీ ఇళ్లు ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇళ్ల నిర్మాణం మాత్రమే కాదని.. గ్రామాలే కొత్తగా తయారువుతున్నాయన్నారు. జగనన్న కాలనీకి అవసరమైన సదుపాయాలు ఏర్పాటు చేయాలని అధికారులుకు సూచించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం రూ. మూడు వేలు పింఛను అందిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ గొండు రఘురామ్, డీసీఎంఎస్ చైర్మన్ గొండు కృష్ణమూర్తి, సర్పంచ్ గొలివి వెంకటరమణమూర్తి, ఎంపీటీసీ సభ్యుడు రుప్ప శ్రీనివాసరావు, తహసీల్దార్ జెన్ని రామారావు, వీఆర్వో సీహెచ్ చక్రవర్తి, అంబటి చినబాబు, శీర సత్యం ఉన్నారు.

గ్రామ స్వరాజ్యమే సీఎం జగన్ లక్ష్యం


పున్నాంలో హెల్త్ క్లినిక్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

- ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

జి.సిగడాం: గ్రామ స్వరాజ్యమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. సేతుభీమవరం, మెట్టవలసల్లో గ్రామ సచివాలయాలు, పున్నాంలో హెల్త్ క్లీనిక్ కేంద్రాలను సోమవారం ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామ సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలను ఇతర రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుంటున్నాయన్నారు. విద్య, వైద్య, తాగు, సాగునీరు అందిస్తున్నామన్నారు. ఎంపీపీ మీసాల సత్యవతి, మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యుడు కాయల రమణ, జేసీఎస్ కన్వీనర్ డోల వెంకటరమణ, ఎంఎంఎస్ అధ్యక్షురాలు వాన ప్రమీల, మామిడి బలరాం, తహసీల్దార్ పప్పల వేణుగోపాలరావు, ఏఈఈ శ్రీవల్లి, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో మళ్లీ వైఎస్సార్‌సీపీదే విజయం..

జి.సిగడాం: రాష్ట్రంలో రానున్న ఎన్నికలో మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టడం ఖాయమని ఎమ్మెల్యే కిరణ్‌కుమార్ అన్నారు. మెట్టవలసలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, సచివాలయ కన్వీనర్లు సైనికుల్లా పని చేయాలన్నారు. టీడీపీ, జనసేన నాయకుల అసత్య ప్రచారాలను తిప్పికొట్టాలన్నారు.

పాఠశాలల్లో సంక్రాంతి సంబరాలు


శ్రీకాకుళం న్యూకాలనీ: వప్పంగి జెడ్పీహెచ్‌లో సంక్రాంతి వేడుకల్లో హెచ్‌ఎం ఇ.ఉమాకుమారి, ఉపాధ్యాయులు

పాఠశాలల్లో ముందస్తుగా నిర్వహించిన సంక్రాంతి సంబరాలు అంబరాన్ని తాకాయి. పాఠశాలలకు సోమవారం నుంచి పండుగ సెలవుల నేపథ్యంలో పిల్లలందరూ ఇళ్లకు బయలుదేరి వెళ్తున్నారు. దీంతో మన సంస్కృతి..సంప్రదాయాలను వారికి తెలియజేసేలా సంబరాలను నిర్వహించారు. ఇందులో భాగంగా భోగి మంటలు వేశారు. డూడూ బసవన్నల సందడి చేశాయి. పిల్లలకు ముగ్గులు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కొన్ని పాఠశాల్లో ఫుడ్ ఫెస్టివల్ ఏర్పాటు చేశారు. సంప్రదాయ దుస్తుల్లో పిల్లలు అలరించారు.


గార: అంపోలులో భోగి మంటలు వేస్తున్న దృశ్యం


శ్రీకాకుళం రూరల్: కిల్లిపాలెం పాఠశాలలో సంబరాలు


శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళంలోని మండల వీధిలో ఉన్న స్కూల్‌లో సంక్రాంతి సంబరాలు


శ్రీకాకుళం: వరం పాఠశాలలో సంస్కృతిక విద్యార్థుల నృత్య ప్రదర్శన


శ్రీకాకుళం న్యూకాలనీ: బలగ ఎంహెచ్ స్కూల్‌లో భోగి మంట వద్ద హెచ్‌ఎం మురళీకృష్ణ, సిబ్బంది

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
శ్రీకాకుళం
9912220343
Office mail : sklmadvt@gmail.com